ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం, 14 ఆగస్టు 2024 | www.prajaaswaramdaily.com | 4 PM

# ఎమ్మెల్సీల నియామకానికి తొలగిన అడ్డంకి

## తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ, ఆగస్టు 14(ప్రజాస్వరం): ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేస్తూ భారాస నేతలు దాసోజు శ్రవణ్ , కుర్ర సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్ , ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది. అనంతరం పిటిషన్ పై విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్ , రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్ నాథ్ , జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.



# రాష్ట్రానికి రేవంత్

## విదేశీ పర్యటన సక్సెస్

### సీఎం టీమ్ కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

### తరలివచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు

### 10 రోజులు.. రూ.31532 కోట్లు.. 30,750 కొత్త ఉద్యోగాలు

### అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలో పలు ఒప్పందాలు

### విజయవంతంగా ముగిసిన పర్యటన

హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాస్వరం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ చేరుకుంది. అమెరికా, దక్షిణకొరియాలో సీఎంతో పాటు, మంత్రి శ్రీధర్ బాబు, పలువురు అధికారులు పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ఆయా దేశాల్లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం బృందం సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రానికి చేరుకున్న సీఎం బృందానికి శంషాబాద్ ఎయిర్ పోర్టులో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. బుధవారం సాయంత్రం కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన క్యాంపస్ ను సీఎం ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలో పలు ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటనలో మొత్తం రూ.31532 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. దాదాపు 30,750 కొత్త ఉద్యోగాలు రానున్నట్లు తెలిసింది. మొత్తం 19 కంపెనీలతో సంప్రదింపులు.. ఒప్పందాలు జరిగింది. పలు కీలక ఒప్పందాలతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతంగా ముగిసింది.

### కొత్త ఐటీ పాలసీపై నేడు సీఎం సమీక్ష

దక్షిణ కొరియాలో శాంసంగ్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, జీఎస్ కల్టెక్స్, సెల్ ట్రియాన్ కంపెనీ ప్రతినిధులతోనూ సీఎం చర్చలు జరిపారు. హన్ రివర్ ప్రాజెక్టును సందర్శించి సియోల్ డిప్యూటీ మేయర్ తో భేటీ అయ్యారు. శామ్ సంగ్ హెల్త్ కేర్ యూనిట్ తో సమావేశమై చర్చలు జరిపారు. అలాగే కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. కాల్ టెక్స్ కంపెనీ ప్రతినిధులతో పెట్టుబడులపై చర్చలు జరిపింది. ఇప్పటికే వరంగల్ టెక్స్ టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్ టైల్ ఇండస్ట్రీ సానుకూలంగా స్పందించింది. దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ మోటార్స్ రాష్ట్రంలో మెగా కార్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. భారత్ లోని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ద్వారా ఒక మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు పెడతామని ఆ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డి బృందానికి తెలిపారు.

### ఈ పర్యటనలో కుదిరిన ఒప్పందాలు ఇవే..

1. కాగ్నిజెంట్: అమెరికా తర్వాత హైదరాబాద్ లో అతి పెద్ద క్యాంపస్. దాదాపు 15,000 ఉద్యోగాలు.
2. వాల్ష్ కార్రా హోల్డింగ్స్: WE-హబ్ లో 5 మిలియన్ డాలర్ల పెట్టుబడులు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణ స్టార్టప్లలో 100 మిలియన్ల పెట్టుబడి.
3. ఆర్సీసియం: దాదాపు 500 హై-ఎండ్ టెక్ ఉద్యోగాలు.
4. స్వచ్ఛ్ బయో: రూ.1000 కోట్ల పెట్టుబడులు. 500 మందికి ఉద్యోగాలు.
5. ట్రైజిన్ టెక్నాలజీస్: హైదరాబాద్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ డెవెలప్మెంట్, డెలివరీ సెంటర్. దాదాపు 1000 ఉద్యోగాలు.
6. హెచ్‌సీఏ హెల్త్ కేర్: నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ విస్తరణ.
7. కార్నింగ్: గ్లాస్ ట్యూబింగ్ ఫెసిలిటీ కేంద్రంలో వచ్చే ఏడాదిలో (2025) వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం.
8. వరల్డ్ బ్యాంక్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం, సహకారం.
9. వివింట్ ఫార్మా: రూ.400 కోట్ల పెట్టుబడి, దాదాపు1000 మందికి ఉద్యోగాలు.
10. చార్లెస్ స్వాబ్: హైదరాబాద్ లో భారతదేశంలోనే మొదటి టెక్నాలజీ డెవెలప్మెంట్ సెంటర్.

### పర్యటన ఫ్లాప్ అయిందో.. సక్సెస్ అయిందో

# ప్రజలకు తెలుసు

## బీఆర్ ఎస్ విషప్రచారం : మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 14(ప్రజాస్వరం): మా పర్యటనలపై బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఫైర్ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, బృందం తిరిగి బుధవారం హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. తమ పర్యటన ఫ్లాప్ అయిందో, సక్సెస్ అయిందో ప్రజలకు తెలుసున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఎవరు ఫ్లాప్ అయ్యారో తెలిసి పోయిందన్నారు. బీఆర్ఎస్ నాయకుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ రెండుసార్లు ఫ్లాప్ అయ్యిందని, అయినా బుద్ధి రాలేదని, ఇలాగే మాట్లాడితే మరోసారి ఫ్లాప్ అవ్వడం ఖాయమని విమర్శించారు. అనేక కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయని వెల్లడించారు. విదేశీ కంపెనీలు స్కిల్ యూనివర్సిటీ ఆలోచనను అభినందించాయని అన్నారు. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ ఉండబోతుందని, మన రాష్ట్ర ఆలోచనను విదేశీ ప్రతినిధులకు చెప్పామని పేర్కొన్నారు. తమ పర్యటనలో నిమిషం కూడా వృధా చేయకుండా సమయాన్ని తెలంగాణ అభివృద్ధి కోసం వినియోగించామని పేర్కొన్నారు.

# రేపే మూడో విడత రుణమాఫీ

- రెండు లక్షల్లోపు అప్పు మాఫీ
- 14 లక్షల మందికి ప్రయోజనం




హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాస్వరం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన రూ.2లక్షల్లోపు రైతు రుణ మాఫీ తుది విడత చెల్లింపుకు ముహూర్తం ఖరారైంది. పంద్రాగస్టు రోజున ఖమ్మం జిల్లా వైరాలో మూడో విడత రైతు రుణమాఫీ నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేస్తారు. ఇప్పటికే రెండు విడతల్లో రైతు రుణాలను తెలంగాణ ప్రభుత్వం మాఫీ చేసింది. మొదటి విడతలో లక్షలోపు రుణాలను మాఫీ చేశారు. రెండో విడతలో లక్షన్నర రుణాలను మాఫీ చేశారు. చివరి విడతలో రెండు లక్షల్లోపు రుణాలను మాఫీ చేయనున్నారు. తెలంగాణలో చివరి విడత రుణమాఫీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లా వైరాలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 14లక్షల మందికి మూడో విడతలో రైతు రుణమాఫీ అమలు చేయనున్నారు. హైదరాబాద్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసిన తర్వాత సీఎం వైరాకు వెళ్తారు. ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తర్వాత జరిగే బహిరంగ సభలో రుణమాఫీ నిధులు విడుదల చేస్తారు.

### ఎన్నికల హామీ అమలు

తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ.2లక్షల్లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ వరంగల్ లో ప్రకటించింది. ఈ మేరకు ఇప్పటికే రూ.లక్ష రుణాన్ని మాఫీ చేశారు. తెలంగాణలో 11,34,412 మందికి రూ.6034 కోట్లను ఇప్పటికే చెల్లించారు. రెండో విడతలో 6,40,223మందికి రూ. 6190 కోట్లను విడుదల చేశారు. మొదటి రెండు విడతల్లో రుణమాఫీ లబ్ది పొందిన వారిలో నల్గొండ జిల్లా మొదటి స్థానంలో, చివరి స్థానంలో హైదరాబాద్ ఉంది. 2024 మే6న వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే రూ.లక్ష, లక్షన్నర లోపు రుణాలను తెలంగాణ ప్రభుత్వం మాఫీ చేసింది. ఆగస్టు నాటికి మొత్తం రూ.2 లక్షల రుణమాఫీ పూర్తవుతుందని గతంలో ప్రకటించారు. ఆగస్టు 15తో రూ.2లక్షలోపు రుణాల మాఫీని పూర్తి చేయనున్నారు.

### మూడో విడతకు నిధుల కేటాయింపు..

మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తారు. మూడో విడతలో 14.45 లక్షల మంది రైతులకు లబ్ది కలుగుతుంది. ఇందుకోసం ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు జరిపారు.

# కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వలేం

## తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ప్రజాస్వరం): మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇప్పట్లో జైలు నుంచి విడుదలయ్యేలా కన్పించట్లేదు. ఈ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఆయన మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ పై సీబీఐకి నోటీసులు జారీ చేసింది. మద్యం విధానానికి సంబంధించి జూన్ చివర్లో కేజ్రీవాల్ ను సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ అరెస్టును సవాల్ చేస్తూ తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఊరట లభించలేదు. అరెస్టు చట్టబద్ధమేనంటూ ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ కేసులో సీఎంకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అనంతరం సీబీఐకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 23వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు ఈడీ కేసులో ఇప్పటికే సుప్రీంకోర్టు ఆయనకు జులై 12న మధ్యంతర బెయిల్ మంజూరుచేసిన సంగతి తెలిసిందే. కానీ సీబీఐ కేసులో అరెస్టయినందున ఆయన జైలు నుంచి విడుదల కాలేకపోయారు.

### నీట్ యూజీ-2024

# కౌన్సెలింగ్ ప్రారంభం

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ప్రజాస్వరం): నీట్ యూజీ-2024 కౌన్సెలింగ్ ఈరోజు ప్రారంభమైంది. మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ ప్రక్రియ నాలుగు రౌండ్లు ఉంటుంది. మొదటి రౌండ్ కు రిజిస్ట్రేషన్, చెల్లింపు ఆగస్టు 14 నుండి 21 వరకు జరుగుతుంది. అయితే సీట్ల కేటాయింపు ప్రక్రియ ఆగస్టు 21, 22 తేదీలలో జరుగుతుంది. కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థులు వివిధ పత్రాలను సమర్పించాలి. ఎంపికలను నింపే సమయంలో శ్రద్ధ వహించాలి. సరైన విధానం, సమయానుకూల చర్య ద్వారా మీరు ఇష్టపడే సీటును పొందేలా చూస్తుంది. ఇక రిజిస్ట్రేషన్ విండో ఆగస్ట్ 20న మూసివేయబడుతుంది. దరఖాస్తు రుసుము చెల్లింపు కోసం విండో కూడా అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు మూసివేయబడుతుంది. ఆప్షన్లను పూరించే, లాక్ చేసే ప్రక్రియ ఆగస్టు 16 నుంచి ప్రారంభమై ఆగస్టు 20 వరకు కొనసాగుతుంది. ఆగస్టు 21-22 మధ్య సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది. రౌండ్-1 సీట్ అలాట్ మెంట్ ఫలితం ఆగస్టు 23న ప్రకటించబడుతుంది. సీట్లు పొందినవారు అభ్యర్థులు 24-29 వరకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.